ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 14-06-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- రాజధాని అమరావతి నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు.
- కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు.
- విజయనగరం జిల్లాలో రిలయన్స్ డేటా సెంటర్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, జీడి గింజల ఇండస్ట్రీ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు.
- సైక్లింగ్ తో ఆరోగ్యానికి, పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి అన్నారు.

====================

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ఎలాంటి అడ్డంకులు లేవని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఈ మేరకు సంబంధిత వీడియోను సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా మంత్రి పంచుకున్నారు. వర్షాలు కురుస్తున్నప్పటికీ రాజధాని ప్రాంతంలో నిరంతరాయంగా నిర్మాణ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. అమరావతి పనులు ప్రస్తుతం టాప్ గేర్‌లో సాగుతున్నాయని, రాజధాని అభివృద్ధి విషయంలో ప్రభుత్వం ఎక్కడా వెనకడుగు వేయట్లేదని, ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని మంత్రి లోకేష్ తెలిపారు. రాజధాని నిర్మాణంలో ఇకపై ఆగడం అనే మాటకు చోటు లేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. నిర్మాణ పనుల వేగం మరింత పెరిగిందని, ఇది నవ్యాంధ్ర భవిష్యత్తుకు బలమైన పునాదవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

====================

కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం మేడపాడు గ్రామంలో ఈరోజు ఆయన 2 కోట్ల 39 లక్షల రూపాయల విలువ గల పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. అన్ని గ్రామాలను సమానంగా అభివృద్ధి చేస్తున్నామని, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడమే తమ ధ్యేయమని అన్నారు.

====================

సైక్లింగ్ తో ఆరోగ్యానికి, పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి అన్నారు. విశాఖపట్నంలో ఈరోజు నిర్వహించిన సండేస్ ఆన్ సైకిల్ ర్యాలీని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. సైక్లింగ్ తో శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందని, కాలుష్యం తగ్గించవచ్చని అన్నారు. సైకిల్ వినియోగానికి అందరూ ప్రాధాన్యత ఇవ్వాలని పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి పేర్కొంటూ...

(వాయిస్...24 సెకన్లు)

=====================

పార్వతీపురం మన్యం జిల్లావ్యాప్తంగా రేపు జలరక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సంబంధిత అధికారులతో కలెక్టర్ ఈరోజు దృశ్య మాధ్యమ విధానంలో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని నీటి వనరులు, చెరువుల పరిరక్షణే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ప్రతి మండలంలోని ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకుని జలరక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించాలని, తహసిల్దార్, ఎంపీడీఓ తప్పనిసరిగా గ్రామంలో చెరువులను సందర్శించాలని సూచించారు. చెరువుల హద్దుల గుర్తింపుపై తహసిల్దార్లు, ఎంపీడీఓలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. జిల్లాలో జలధార, జలహారతి కార్యక్రమాలతో పాటు జలరక్షణ పనులను కూడా సమాంతరంగా వేగవంతం చేయాలన్నారు.

=====================

విరామం

=====================

కేంద్ర ప్రభుత్వ సహకారంతో, కూటమి ప్రభుత్వం పాలనలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని ఎంఎస్ఎంఈ, ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. విజయనగరం జిల్లాలోని బొండపల్లి మండలం జె గుమడంలో ఈరోజు నిర్వహించిన ప్రజా పాలన విజయోత్సవ సభలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం అనేక చర్యలు చేపట్టిందన్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపామని, అనకాపల్లిలో నూతన స్టీల్ ప్లాంట్ నిర్మాణం, భోగాపురం ఎయిర్‌పోర్ట్ సాధన, వైజాగ్‌లో గూగుల్ వంటి సంస్థలను రప్పించామని చెప్పారు. విజయనగరం జిల్లాలో రిలయన్స్ డేటా సెంటర్‌తో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, జీడి గింజల ఇండస్ట్రీ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు.

=====================

యోగా అభ్యసనను ప్రతిఒక్కరూ జీవన శైలిలో భాగం చేసుకోవాలని పశ్చిమ గోదావరి జిల్లా సంయుక్త కలెక్టర్ వై. మేఘా స్వరూప్ కోరారు. ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రాజమండ్రి గౌతమి ఘాట్‌లో యోగాంధ్ర కార్యక్రమాన్ని ఈరోజు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా యోగా శిక్షకులు ధ్యానం, రాజయోగ సాధన వలన కలిగే ప్రయోజనాలను వివరించి యోగాసనాలు సాధన చేయించారు. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు యోగా చేయడం ద్వారా ఏకాగ్రత, మానసిక స్థైర్యం పెంపొందించుకుని లక్ష్యసాధనలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు.

=====================

రానున్న 4, 5 రోజుల్లో నైరుతి రుతుపవనాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకలో కొన్ని ప్రాంతాలు, ఒడిశాలోని అదనపు ప్రాంతాలు, దక్షిణ ఛత్తీస్‌గఢ్ లోని కొన్ని భాగాలకు విస్తరించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని భారత వాతావరణ శాఖ (IMD) ఈరోజు అంచనా వేసింది. సగటు సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో, దక్షిణ తెలంగాణ, దాని పరిసర ప్రాంతాలపై ఉన్న నిన్నటి ఉపరితల ఆవర్తనం ఈరోజు బలహీనపడిందని తెలిపింది. మరిన్ని వాతావరణ విశేషాలను వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ తెలియజేస్తూ...

(వాయిస్…24 సెకన్లు)

=====================

పశ్చిమగోదావరి జిల్లా భీమవరం లాంచీలా రేవు వద్ద ఈరోజు యనమదుర్రు కాలువలో గుర్రపు డెక్క, నాచు, కిక్కిస తొలగింపు పనులను రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారు కోటి 50 లక్షల రూపాయలతో 32 కిలోమీటర్ల మేర కిక్కిస తొలగింపు పనులను చేపడుతున్నామని తెలిపారు. ఈ పనుల ద్వారా నీటి పారుదల మెరుగుపడి రైతులకు నీటి ఇబ్బందులు తొలుగుతాయన్నారు.

=====================

తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో వార్షిక తెప్పోత్సవాలు జూన్ 25 నుండి 29వ తేదీ వరకు ఐదు రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది. పాంచరాత్ర ఆగమ సంప్రదాయాల ప్రకారం నిర్వహించే ఈ మహోత్సవాల్లో పద్మసరోవర తీరాన అమ్మవారు విశేష పూజలను అందుకుని భక్తజనులను కటాక్షించనున్నారని టిటిడి ఆ ప్రకటనలో పేర్కొంది.

=====================

పోలవరం జిల్లా పరిధిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్ - గ్రీవెన్స్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలను రేపు ఉదయం 10 గంటల 30నిముషాలకు రంపచోడవరం ఐటీడీఏ సమావేశ మందిరంలో యథావిధిగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ శాఖల జిల్లా అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలోని ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

=====================

=====================